క్లుప్తంగా

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు అర్జీలు సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

నేడు పాలకలలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని పాలకల రెడ్డివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. గర్భిణులకు గుండె, బీపీ పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

23న తిరుపతిలో మాలల సింహగర్జన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎస్సీ వర్గీకరణ నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న మాలల సింహగర్జన నిర్వహించనున్నట్లు పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆదివారం మాలల సింహగర్జనపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తిరుపతిలో ఈనెల 23న రాయలసీమ మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గుడిపాల మండల కన్వీనర్ ప్రకాష్, మాల నాయకులు సుదర్శన్, రవి, ప్రభాకర్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వద్దు.. చేపలే ముద్దు



చేపలు కొనేందుకు ఆసక్తి చూపుతున్న జనం

గుడిపాల: మాంసాహారులు ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్కలేనిదే ముద్ద తినరు. అయితే ఇప్పుడు చాలామంది ప్రజలు బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ తినడం మానేశారు. అయితే మటన్ కొందామంటే మార్కెట్లో కిలో రూ.750 నుంచి రూ.850 వరకు పలుకుతోంది. దీన్ని కొనలేని సామాన్య జనం చేపలవైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో చేపలు ధర కూడా అమాంతం పెరిగిపోయింది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.150 పలికిన చేపలు, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. అయినప్పటికీ సామాన్య జనం చికెన్ తినలేక చేపలు కొంటున్నారు. ఆదివారం చికెన్ సెంటర్లు జనం లేక వెలవెలబోయాయి. అదే సమయంలో చేపల వ్యాపారం జోరుగా సాగింది.

భగవద్గీతపై ప్రచారం

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలంలోని వరదరాజులపల్లెలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు భగవద్గీతపై ఇంటింటా ప్రచారం చేశారు. పండుగలపై అవగాహన కల్పించారు. భగవద్గీత పఠనంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు ధనుంజయ్య మునిరత్నం, సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాజగోపుర భూమిపూజ



ప్రత్యేక పూజలు

గంగాధరనెల్లూరు: మండలంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాజగోపురం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదమంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ గోపుర నిర్మాణానికి ఆలయ ట్రస్టు సభ్యులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అతి త్వరలోనే ఆలయ రాజగోపురం నిర్మాణం పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు: పుంగనూరు డివిజన్ పరిధిలోని రైతులకు సబ్సిడీ ధరపై వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయనున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లోని రైతులు వ్యవసాయపనిముట్ల కోసం ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కేటాయించారన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోడెగిత్తల జోరు





బంగారుపాళెం మండలంలోని ముంగరమడుగు గ్రామంలో ఆదివారం ఎద్దుల పందేలు నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా జరిపిన ఈ పందేలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి యజమానులు పశువులను టెంపోల ద్వారా తీసుకువచ్చారు. పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. పోటీలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. పశువుల పరుగు పందెంను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పశువుల పరుగు పందెం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు.

– బంగారుపాళెం

కొత్త రేషన్ కార్డులు ఎప్పుడో?

- ఎదురుచూస్తున్న పేద ప్రజలు
- గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు



గుడిపాల తహసీల్దార్ కార్యాలయం

గుడిపాల: కొత్తరేషన్ కార్డులు ఎప్పుడిస్తారో అని అర్హులైన లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రేషన్‌కార్డుల కోసం రోజూ గ్రామ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదినెలలు గడుస్తున్నా కొత్తరేషన్ కార్డుల మంజూరుపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో అర్హులైన లబ్ధిదారుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. చిత్తూరు నియోజకవర్గ వ్యాప్తంగా వందల సంఖ్యలో పేదల ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగేది. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులతోపాటు కొత్తగా పెళ్లైన వారికి రేషన్‌కార్డు అవసరం. ఇప్పటివరకు కుటుంబంలో ఉన్న వారి పేర్లను రేషన్‌కార్డుల నుంచి తొలగించేందుకు స్ప్లిట్ ఆప్షన్ కూడా లేకపోవడం, పేర్ల మార్పు, చేర్పులను చేపట్టలేదు. దీంతో వివాహమై ఇంటి పేరు మారినా రేషన్‌కార్డులో మాత్రం పేరు నమోదు కావడం లేదు. ఫలితంగా రేషన్ బియ్యం అందక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేరుకుపోతున్న దరఖాస్తులు

గతంలో కొత్తగా పెళ్లయిన వారు తల్లిదండ్రుల కార్డుల నుంచి తమ పేర్లు తొలగించాలని దరఖాస్తు చేసుకుంటే స్ప్లిట్ ఆప్షన్ ద్వారా సచివాలయ సిబ్బంది వెంటనే వారి పేర్లను కార్డుల నుంచి తొలగించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్‌కార్డు వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో కొత్త జంట కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు అతీగతీ లేకుండా పోయింది. గ్రామ సచివాలయ సిబ్బందిని అడిగితే ఆప్షన్ రాలేదని సమాధానం చెబుతున్నారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా వందల మంది నూతన రేషన్‌కార్డులు కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు.

కార్డుకోసం ఎదురుచూస్తున్నాం

నాకు వివాహమైనప్పటి నుంచి రేషన్‌కార్డు కోసం ఆశగా ఎదురుచూస్తున్నా. గ్రామ సచివాలయం వద్దకు పలుమార్లు తిరిగినా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని సిబ్బంది చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్తరేషన్ కార్డులు మంజూరు చేయాలి.

–సుబ్రమణ్యం, గుడిపాల

ఉత్తర్వులు రావాల్సి ఉంది

నూతన రేషన్‌కార్డుల కోసం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే ప్రజలకు తెలియజేస్తాం. అంతవరకు ప్రజలు ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగవద్దు. వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే మార్పులు, చేర్పులు, కొత్తరేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

–జయంతి, తహసీల్దార్, గుడిపాల

అపూర్వం.. మధుర స్మృతుల సమ్మేళనం



నాటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర హైస్కూల్లో నాలుగు దశాబ్దాల ముందు పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సరదాగా సందడిగా సాగింది. ఆ నాటి జ్ఞాపకాలను, అనుభూతులను, అనుభవాలను పంచుకున్నారు. రోజంతా ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన 15 మంది గురువులను ఆహ్వానించారు. వారికి పాదాభివందనం చేసి శాలువలు కప్పి, పూలదండలతో సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ పాఠశాలకు ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు ఉమాపతి, ధర్మేంద్ర, జయంతిరెడ్డి, మన్నారు ప్రసాద్, కృపాసాగర్ రెడ్డి, కుమార్‌నాయుడు, రెడ్డిప్రసాద్, మాధవి, కమలాపతి, సుకుమార్, పూర్ణచంద్ర, శ్రీనివాసులుతోపాటు సుమారు 200 మంది ఈ సమ్మేళనానికి హాజరయ్యారు.



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ముగిసిన మరమ్మతులు



స్థానిక మెసానిక్ మైదానం వద్ద ఉన్న రైల్వే లైన్ మరమ్మతు పనులు ముగిశాయి. ఇప్పుడు గేటు తెరుచుకోవడంతో ఆదివారం వాహనదారులు రైల్వే గేటుగుండా రాకపోకలు సాగిస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఇక్కడ పనులు జరుగుతుండడంతో ఇటువైపుగా ప్రయాణించే వారు ఇబ్బందులు పడ్డారు. గిరింపేట, దుర్గానగర్‌కాలనీ, వల్లియప్పనగర్, బ్రాహ్మణవీధి, చామంతిపురం, మిట్టూరు ప్రాంతాల నుంచి కొంగారెడ్డిపల్లెకు అటువైపుగా వెళుతుంటారు. కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, ఎస్టేట్ వాసులు ఇటువైపుగా కలెక్టరేట్, కళాశాలలు, వ్యవసాయ కార్యాలయంతోపాటు వేలూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. పనులు జరిగినన్ని రోజులు వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

–చిత్తూరు కార్పొరేషన్

ఉచిత వైద్య శిబిరం

గంగాధరనెల్లూరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో 200 మంది రోగులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా గుండె, కాలేయం, కళ్లు, తుంటి కీళ్లు, ఎముకలు తదితర పరీక్షలను నిర్వహించారు. తద్వారా పరీక్షలు నిర్వహించి సత్వర తదుపరి వైద్య చికిత్స అవసరం ఉన్నవారికి బెంగళూరు హాస్పిటల్లో ఉచితంగా వైద్యం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి అభిషేక పండుగలు

కార్వేటినగరం: నేటి నుంచి అభిషేక పండుగలు నిర్వహించనున్నట్లు బేతేల్ షారోన్ చర్చి పాస్టర్ ఆశీర్వాదం తెలిపారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏడాది మార్చి నెలలో నిర్వహించే అభిషేక పండుగలు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి చెన్నై నుంచి థామస్ చాకో ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ముఖ్య ప్రసంగీకులు, అంతర్జాతీయ టీవీ ప్రసంగీకులు పాస్టర్ కళ్యాణ్‌బాబు పాల్గొంటారన్నారు. పాస్టర్లు బాబు, మోసస్ బాలన్ పాల్గొని ప్రభువు ప్రవచనాలను వివరిస్తారని తెలిపారు.

సహజ పానీయం.. ఎంతో శ్రేష్టం

- వేసవిలో వడదెబ్బ ముప్పు
- శీతల పానీయాలతో అనారోగ్యాలు
- మండే ఎండల్లో జాగ్రత్తలు పాటించాలంటున్న డాక్టర్లు



బంగారుపాళెం: ఎండలు రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్నాయి. బయటకు వెళ్లాలంటే మండుతున్న ఎండలు భయపెడుతున్నాయి. వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాలు, పండ్ల రసాలు, కర్బూజ(వాటర్‌మిలన్), కొబ్బరి నీళ్లతో సేదతీరుతున్నారు. వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే మంచిదని డాక్టర్లు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

విపరీతమైన తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, ఫిట్స్ రావడం, అపస్మారక స్థితికి చేరుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా గుర్తించాలి. ఎండవేడితో ఎక్కువగా చెమట పట్టి శరీరంలోని లవణాలు బయటకు పోతాయి. తద్వారా శరీరంలోని నీటి నిష్పత్తి తగ్గి ప్రాణాపాయం ఏర్పడే ప్రమా దం ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేస్తున్నప్పుడు ప్రతి గంటకు మూడు నుంచి నాలుగు లీటర్ల నీరు మన శరీరం నుంచి చెమట రూపంలో పోతుంది.

అప్రమత్తంగా ఉండాలి

వృద్ధులు, గర్భవతులు, బాలింతలు, పసిపిల్లలు, గుండెజబ్బు, రక్తపోటుతో బాధపడుతున్న వారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.. వీరు ఎండలో ఎక్కువ తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఇలా జాగ్రత్తలు పాటించాలి

ఎండలో తప్పనిసరిగా బయటకు వెళ్లేటప్పుడు గొడుగు వాడాలి. తెలుపురంగు పలచటి చేనేత వస్త్రాలను ధరిస్తే మంచిది. వేడి గాలి తగలకుండా తలకు రుమాలు, టోపి ధరించాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయట తిరగడం మంచిది కాదు. శీతలపానీయాలు, ఐస్‌ముక్కలు వేసిన పానీయాలు తీసుకోరాదు. వేసవిలో ఎక్కువగా మంచినీరు, నిమ్మరసం, కొబ్బరినీళ్ల, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి.

వడదెబ్బకు గురైతే..

వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడలోకి తీసుకువెళ్లాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చే వరకు చల్లని నీటితో ముంచిన తడి గుడ్డతో తుడవాలి. చల్లగాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ గానీ, గ్లూకోజ్ గానీ తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి వెంటనే నీరు తాగించరాదు. వీలైనంత త్వరగా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలి.

– డాక్టర్ లోహిత్‌వెంగల్‌రాయన్, తుంబకుప్పం పీహెచ్‌సీ

శీతల పానీయాలతో సమస్యలు

ప్రస్తుతం అన్ని దుకాణాల్లో శీతల పానీయాలు ఉంటున్నాయి. వాటిని సరసమైన ధరలకు విక్రయిస్తున్నందున కొనేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత వేసవిలో నియోజకవర్గంలోని బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల్లో రోజుకు రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు వ్యాపారం సాగుతున్నట్లు అంచనా. శీతల పానీయాలు అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. శీతల పానీయాల్లో ఉండే కార్బన్ డై ఆక్సైడ్, ఫాస్పరిక్ ఆమ్లాలు కణాల్లో ఆక్సిజన్ నిల్వలను తగ్గించి క్యాన్సర్‌కు దారితీస్తాయి. సోడియం బెంజోయేట్ అనే ప్రిజర్వేటివ్ రసాయనం కణాల్లోని డీఎన్‌ఏపై ప్రభావం చూపుతుంది. వాటిలోని అదనపు క్యాలరీస్ స్థూలకాయానికి దారితీస్తుంది. పానీయంలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల రక్తపోటు పెరుగుతుంది. అధికంగా తాగితే దంతాలపై పొర దెబ్బతింటుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. దీర్ఘకాలంగా శీతల పానీయాలు తాగితే మెటబాలిక్ సిండ్రోమ్ అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని సీఎస్ఈ సంస్థ హెచ్చరించింది.



నిమ్మరసం ఆరోగ్యకరం

మన నిత్య జీవితంలో శీతల పానీయాల వినియోగం పెరుగుతోంది. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే వాటి వాడకం అధికమైతోంది. ప్రతి ఇంటిలోనూ అందుబాటులో ఉంటున్నాయి. ఇంటికి బంధువులు వచ్చినా..మనం బయటకు వెళ్లి ఇంటికి వచ్చినా.. శీతల పానీయాలనే తాగుతున్నాం. వాటి వినియోగం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు వాటికి బదులు సహజపానీయాలు తాగాలని సూచిస్తున్నారు. సహజ పానీయాలైన నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, షర్బత్, రాగిమాల్ట్ వంటికి ఆరోగ్యానికి మేలుచేస్తాయన్నారు.



హాస్టల్లో పెచ్చులూడిన భవనం పైకప్పు



పెచ్చులూడుతున్న హాస్టల్ గదులు

గుడిపాల: మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ భవనం పైకప్పు అంతా పెచ్చులూడుతోంది. ఆ పెచ్చులు తమ మీద పడతాయేమోనని విద్యార్థినులు భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ హాస్టల్‌లోని విద్యార్థినులు స్థానికంగా ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. హాస్టల్ మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. బాత్‌రూములు మొత్తం అపరిశుభ్రంగా, పాచిపట్టి దర్శనమిస్తున్నాయి. స్నానమాచరించేటప్పుడు జారిపడుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. పడుకునే గదిలో పెచ్చులూడిపోతున్నాయి. ఫ్యాన్‌లు కూడా సరిగ్గా పనిచేయడం లేదు. ఇకనైనా అధికారులు స్పందిస్తారేమో చూడాలి.



పాచిపట్టిన బాత్‌రూమ్‌లు